## అభిమన్యుడు


ఆయాసంతో రొప్పుకుంటూ ఆఫీసులోకి అడుగు పెట్టిన అభిమన్యుని చూడగానే అటెండర్ సహదేవుడు "మీరు రాగానే మేనేజర్‌గారు కలవమని చెప్పారండి" అన్నాడు.

అది వినేసరికి అభిమన్యు గుండె గుభేల్‌మంది. ఎడమ కన్ను అదరడం మొదలెట్టింది. నెమ్మదిగా గుండె చిక్కబట్టుకుని మేనేజర్ గదిలోకి అడుగు పెట్టాడు. అతన్ని చూడగానే మేనేజర్ భీష్మారావు మండిపడుతూ "ఏనోయ్ అభిమన్యు! రోజూ ఇంతాలస్యంగా వస్తున్నావ్? ఏంటి కథ? ఏం ఉద్యోగంలో వుండాలని లేదా?" అంటూ కస్సుమన్నాడు.

"అదికాదు సార్! బస్సులు... విపరీతమైన రద్దీ... సమయానికి..." అంటూ ఏదో చెప్పబోయాడు అభిమన్యు.

ఆ మాటల్ని మధ్యలోనే కట్‌చేస్తూ "ఏంటయ్యా! ఏంటా కుంటిసాకులు? ఆఁ! ఏదో ఒకరోజు లేటంటే పోనీలే అనుకోవచ్చు. ప్రతి రోజూ ఆఫీసుకు లేటుగా రావడమేనా? సిటీ బస్సులు ఎంత రద్దీగా వుంటే మాత్రం పద్మవ్యూహంలోకి దూసుకు పోయినట్లు దూసుకుపోయి ఎక్కాలిగానీ... మళ్ళీ పేరు చూస్తే అభిమన్యు... దూసుకుపోవడం మాత్రం చేతకాదు... షేమ్, షేమ్...!" అన్నాడు భీష్మారావు వెటకారంగా.

"సార్! ఆ పేరువల్లనే అనుకుంటా నాకిన్ని తిప్పలు! నిజానికి బస్సు ఎంత రద్దీగా వున్నా, ఎంత జనమున్నా అభిమన్యుడిలానే దూసుకుపోయి, అందరికంటే ముందుగా నేనే బస్సెక్కుతాను. కానీ, దిగేటప్పుడే సార్ వస్తుంది చిక్కంతా! మన ఆఫీసు దగ్గర స్టాప్‌లో దిగిపోదామని ఎంత ప్రయత్నించినా ఆ జనాన్ని ఛేదించి దిగడం నావల్ల కావడం లేదు. చచ్చీ చెడీ రెండు




స్టాప్‌ల తర్వాత ఎలాగోలా దిగి ఇలా పరిగెట్టుకు వస్తున్నాను. రోజూ ఇదే బాధ సార్! ఇక నావల్లకాదు ఈ పేరును భరించడం! ఏ అర్జునరావు గానో నా పేరు మార్చేసుకుంటాను. లేకపోతే నా ఉద్యోగం..." అని ఇక మాట్లాడలేక 'పోయేలా వుంది' అన్న అర్థమొచ్చేలా చేయి వూపాడు దిగాలుగా.


మేనేజర్ భీష్మారావు గాంభీర్యం 'మేనేజ్' చేద్దామన్నా సాధ్యంకాక నవ్వేశాడు. అభిమన్యు నవ్వుకుంటూ మేనేజర్ గదినుంచి బయటపడ్డాడు.

—తుర్లి రాజగోపాల్

## జాబ్ శాటిస్‌ఫాక్షన్

ఆఫీసరుగా ప్రమోషన్ వచ్చినప్పటినుండి ఏదో అసంతృప్తిగానే వుంది. ప్రమోషనొస్తే సంతోషించాలి గాని... అంటారేమో మీరు.

అక్కడేవుంది మన ప్రత్యేకత.




ప్రమోషన్ రాకముందు — మిగిలిన స్టాఫ్‌తో ఒకే కామన్ హాల్లో కూర్చుని, సందడిగా, సరదాగా కలిసిమెలిసి పనిచేసుకుపోతుంటే ఏ కష్టం తెలిసేది కాదు. లంచ్ అవర్‌లో అందరి కారేజ్‌లు ఒక చోట పెట్టుకుని, ఒకరిని ఒకరు షేర్ చేసుకుంటూ తింటుంటే నిత్యం పెళ్ళి భోజనంలా... ఓహ్! ఎంత తియ్యటి అనుభవం! కష్టం-సుఖం ఒకరికొకరు చెప్పుకుంటూ — ఒకరికొకరు సలహాలు ఇచ్చి పుచ్చుకుంటుంటే — అదొక రకమైన ధైర్యం కాదూ!

ప్రమోషనొచ్చాక... ప్రత్యేకంగా వేరే గది... ఐ మీన్ రూమ్ అరెస్ట్. నాకూ మిగతా స్టాఫ్‌కూ మధ్య ఎంత దూరం ఏర్పడిందని? వాళ్ళు నా దగ్గరకు రావాలి కాని... ఆఫీసర్నైన నేను వాళ్ళ దగ్గరకు వెళ్ళకూడదు. వచ్చినా... ఫ్రీగా నవ్వకూడదు. స్టాఫ్‌తో ఫ్రీగా ఇదివరకటిలా మాట్లాడకూడదు. అలా చేస్తే అథారిటీ చెలాయించడం కుదరదట. డిసిప్లిన్ దెబ్బ తింటుందట. ఎప్పుడూ సీరియస్‌గా... మొహం మాడ్చుకున్నట్టు... ఆముదం తాగినట్టు తెచ్చిపెట్టుకున్న గాంభీర్యంతో, చేతకాని అభినయంతో... ఆర్టిఫిషియాలిటీతో వుండడం, ఆఫీసర్లకుండవలసిన లక్షణాలట, నా పై ఆఫీసరు ఇచ్చిన సలహా ఇది.

అయితే, నాకంటే మా ఇంట్లో పనిచేసే పనిపిల్ల ఈ విషయంలో వెంటనే ఒక నిర్ణయానికొచ్చింది.

రోజుకోరకం టిఫిన్, పూటకో వెరైటీ భోజనం, ఇంట్లో కలర్ టీవి వుంది. అప్పుడప్పుడు వి.సి.ఆర్.లో చిరంజీవి సినిమాలు చూపిస్తూనే వున్నాం. ఆ పిల్లకు ప్రత్యేకంగా టూత్ పేస్టు - బ్రష్ - సోప్ - కూంబ్ - పౌడరు - బొట్టు బిళ్ళలు - రబ్బర్ బాండ్స్ - రెండు జతల బట్టలు కొత్తవి - ఇచ్చినా "ఆడుకోడానికి మీ ఇంట్లో పిల్లల్లేరు - నేనెళ్ళి పోతున్నా" అంటూ వచ్చిన నెల్రోజులకే చెక్కేసింది.


ఏం చేస్తాం - జాబ్ శాటిస్‌ఫేక్షన్ లేకపోతే అంతే మరి.

—పిసిశెట్టి శ్రీనివాసరావు

## పూర్ ఫెలో

రైలు పూర్తిగా ప్లాట్ ఫారం మీద ఆగకుండానే చటుక్కున ఓ కంపార్టుమెంట్‌లోకి జొరబడ్డా . అదొక రిజర్వేషన్ కంపార్టుమెంట్ లక్కీగా విండో సీట్ దొరికింది. కూర్చుని చుట్టూ చూశాను. ఓ ముసలాయన, ప్రక్కనే ఆయన భార్యనుకుంటా ఇద్దరూ సగం నిద్రలో వున్నారు. ఆ ప్రక్కనే ఓ నడివయస్సాయన దీక్షగా 'హిందూ' పేపర్ చదువుకుంటున్నాడు. ఇటు ప్రక్క ఓ ముగ్గురు కాలేజీ స్టూడెంట్లు కులాసాగా 'ర్యాగింగ్' కబుర్లు చెప్పుకుంటున్నారు. ఇంతలో కాఫీ అంటూ అరుస్తున్నాడు. నేనో కప్పు తీసుకున్నాను. అలికిడికి మెలుకువొచ్చిన ముసలాయన కూడా ఓ కాఫీ తీసుకున్నాడు. స్టూడెంట్లు ముగ్గురూ కూడా తీసుకున్నారు. ఆ నడివయస్సాయన కనీసం తలకూడా తిప్పలేదు.

కిటికీ లోంచి బయటికి చూస్తూ కొద్దిగా సిప్ చేశాను. అసలు తాగుతున్నదేమిటో అర్థం కాలేదు. చుట్టూ చూశాను. అందరూ చేదు తిన్నట్టుగా మొహాలు పెట్టారు.




'అదేమిటయ్యా! కాఫీ అన్నావు'! అడిగాను నేను.

కాఫీ యేసార్!

కొంపదీసి 'టీ' ఇచ్చావేమోనయ్యా! అన్నాడు ఆ ముసలాయన.

"టీ లాగా కూడా లేదు గానీ కాఫీ మాత్రం ఖచ్చితంగా కాదు" అన్నాడు ఓ స్టూడెంటు.

"బహుశా కాఫీ అయ్యుంటుంది" అన్నా నేను.

ఆ నడివయస్సాయనతో సహా అందరూ గొల్లున నవ్వారు.

రైలు కదిలింది. "నిజం చెప్పనోయ్!" అని అడిగాను నేను. వాడేం మాట్లాడకుండా దిగిపోయాడు. కిటికీ దగ్గర కొచ్చి నెమ్మదిగా అన్నాడు.

"కాఫీకని తెచ్చిన పాలు విరిగిపోయాయి సార్!"

"మరి ఇదేమిటి?" ఆశ్చర్యంగా అడిగాను నేను.

"ఇది! ఇది!..." నీళ్ళు నములుతూ అన్నాడు." ఇందాక కురిసి వెలిసిన వాన నీళ్ళు! దయచేసి ఎవరితో చెప్పకండి సార్!" నాకు నోట మాట రాలేదు.

— భోగాది వెంకటేశ్వర్